క్లుప్తంగా

కాలనీలో పారిశుద్ధ్య పనులు



చెత్త కుండీలను ఏర్పాటు చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కొడవలూరు : స్థానిక ఎన్టీఆర్ గిరిజన కాలనీలో వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సిమెంట్ వరలతో చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. వలంటీర్లకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి టి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దత్త గ్రామమైన ఎన్టీఆర్ గిరిజన కాలనీలో వారం రోజులపాటు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డికి అభినందన

పొదలకూరు : ప్రైవేటు పాఠశాలల గుర్తింపును మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీఓను జారీ చేయగా, అందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని సోమవారం మండలంలోని వరదాపురం సాయినాథ్ స్కూల్ కరస్పాండెంట్, అపస్మా నేత డి.శ్రీనివాసులురెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పర్వతరెడ్డి ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చుకున్నట్లు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

సుధీర్‌రెడ్డికి పితృవియోగం



సీఆర్‌రెడ్డి (ఫైల్)

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయా డెయిరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డికి పితృవియోగం జరిగింది. సుధీర్‌రెడ్డి తండ్రి, ప్రసిద్ధ వైద్యుడు చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి(సీఆర్ రెడ్డి) సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు సుధీర్‌రెడ్డికి తమ సంతాపం వ్యక్తం చేశారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



నరసమ్మ (ఫైల్)

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీకి చెందిన కొమరాల నరసమ్మ(85) తీవ్రమైన వడదెబ్బకు గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. బంధువుల కథనం మేరకు.. వడదెబ్బకు గురైన నరసమ్మను బంధువులు 108లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

ఉల్లాసంగా జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు బుజబుజనెల్లూరులోని ఏసీఐ స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ ఎం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పశు వైద్య దినోత్సవంలో భాగంగా అంతర్ జిల్లాల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలను నెల్లూరులో నిర్వహించడం అభినందనీయమన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే తమ శాఖ ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యానికి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. జోన్-3 నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జోన్-4 నుంచి వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల పశువైద్యులు/సహాయ సంచాలకుల స్థాయి అధికారులు పోటీలకు హాజరయ్యారు. నెల్లూరు జిల్లా జట్టుకు డాక్టర్ మదన్‌మోహన్, వైఎస్సార్ జిల్లాకు డాక్టర్ మంగేష్, ప్రకాశం జిల్లాకు డాక్టర్ విశ్వంరెడ్డి, కర్నూలు జిల్లాకు డాక్టర్ నిత్యశ్రీనివాస్ కెప్టెన్లుగా వ్యవహించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ డాక్టర్ ఆర్.వసంతరాయులు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ మహేశ్వరుడు పాల్గొన్నారు.

బాలిక పరార్

నెల్లూరు(క్రైమ్): ఇంట్లోని నగదు, బంగారు, వెండి ఆభరణాలతో బాలిక ఇంట్లో నుంచి పరారైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు...అన్నమయ్య సర్కిల్ సమీప గిరిజన కాలనీలో ఓ మహిళ తన కటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆమె కుమార్తె పదో తరగతి వరకు చదువుకుంది. పరీక్షల్లో తప్పడంతో ఇంటి వద్దే చదువుకుంటోంది. ఈనెల 23న మహిళ పనికి వెళ్లగా ఆమె కుమార్తె ఇంట్లో ఒంటరిగా ఉంది. పక్కవీధిలో నివాసం ఉంటున్న మహిళ తల్లి ఇంటికొచ్చి బాలిక వద్ద కూర పెట్టించుకుని వెళ్లింది. తిరిగి ఆమె సాయంత్రం వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. దీంతో మనుమరాలు కనిపించలేదన్న విషయాన్ని ఆమె తన కుమార్తెకు ఫోన్‌లో తెలియజేసింది. మహిళ పనినుంచి ఇంటికొచ్చి కుమార్తె కోసం చుట్టుపక్కల గాలించిన జాడ తెలియరాలేదు. బీరువాలోని రూ 43వేల నగదు, బంగారు మాటీలు, కమ్మలు, ఉంగరం, వెండిపట్టీలు కనిపించలేదు. ఈ మేరకు బాధిత తల్లి దర్గామిట్ట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ సర్కార్‌కే తిరుగులేని విజయం



సంక్షేమ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

• వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు తిరుగులేని విజయం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పైనాపురం సచివాలయ పరిధిలోని మునునూరువారిపాళెంలో సోమవారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఇంటింటికి తిరిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన సర్వేలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు తిరుగులేదనే విషయం వెల్లడైందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి–సంక్షేమ పథకాలకు ఈ సర్వే అద్దం పడుతోందన్నారు. ఒక సంవత్సర కాలంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇది పూర్తయిన తర్వాత ప్రజలు కోరిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెడుతామన్నారు.

ముత్తుకూరుకు రూ.120 కోట్లు

సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు మండల సమగ్ర అభివృద్ధికి రూ.120 కోట్లు విడుదల చేశామని మంత్రి కాకాణి అన్నారు. ఒక్క మునునూరువారిపాళెం గ్రామానికి రూ.5 కోట్లు, పైనాపురం గ్రామానికి రూ 2.96 కోట్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం శిలాఫలకాలు వేయడానికే పరిమితమైపోయిందన్నారు. అయితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి–సంక్షేమానికి పెద్దపీట వేసిందని, ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చుకున్నామన్నారు. తాను మంత్రి పదవి చేపట్టిన తర్వాత ఎన్నో ఏళ్లుగా అమలుకు నోచుకోని మత్స్యకారేతర ప్యాకేజీని పంపిణీ చేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, స్థానిక సర్పంచ్ మునుకూరు జనార్ధనరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, నేతలు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు సుధీర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సీపారెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అర్థరహిత విమర్శలు తగవు

• స్వగ్రామంలో వార్డు సభ్యుడిగా గెల్చుకో చూద్దాం
• పోలంరెడ్డి దినేష్‌రెడ్డిపై చలపతిరావు ఫైర్



మాట్లాడుతున్న వీరి చలపతిరావు

కొడవలూరు : రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టేలా అర్థరహిత విమర్శలు చేయడం తగదు అని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఎస్సీ నేతలను కుక్కలతో పోల్చడాన్ని తప్పుపట్టారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు కనీసం పంచాయతీ వార్డు సభ్యుడిగా కూడా గెలవని నీవు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఎలా విమర్శిస్తావని ప్రశ్నించారు. నీ స్వగ్రామమైన నార్తురాజుపాళెంలో 14 వార్డులున్నాయని, వాటిలో ఏ వార్డు కావాలో కోరుకుంటే అక్కడి వార్డు సభ్యుడ్ని రాజీనామా చేయిస్తానన్నారు. తండ్రీ, కొడుకులు ఏ వార్డులు కావాలో కోరుకొని గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. పార్టీ ఇన్‌చార్జి పదవి ఇస్తే చంద్రబాబుకు భజన చేసుకోవాలే తప్ప అడ్డగోలుగా విమర్శించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలో డబ్బులిచ్చి తరలించిన జనాల మధ్య స్వగ్రామంలో ప్రెస్‌మీట్ పెట్టుకునే స్థాయి నీది అని దినేష్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు, నీ తండ్రికి దమ్ము, ధైర్యం ఉంటే స్వగ్రామంలో పోలీసుల అండ లేకుండా తిరిగాలని సవాల్ విసిరారు. సీనియర్ నేత యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ నీచ సంస్కృతికి బీజం వేయడం సరికాదని దినేష్‌రెడ్డిని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రమేష్, ఎస్.కామాక్షి, వి.నవీన్, నేతలు కె.శ్రీనివాసులురెడ్డి, ఎస్.మాణిక్యరావు, పి.మధుసూదన్‌రెడ్డి, ఎండీ.కరిముల్లా, శ్రీనివాసులు, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు మండలాల్లో మంత్రి కాకాణి పర్యటన

ముత్తుకూరు : మండలంలోని పైనాపురంలో మంగళవారం ఉదయం 10 గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని వెల్లడించారు.

పేడూరులో..

తోటపల్లిగూడూరు : మండలంలోని పేడూరు పంచాయతీలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొంటారన్నారు.

ఎస్పీకి వినతి

నెల్లూరు(క్రైమ్): గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామస్తులు ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డికి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తులు గ్రామంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో సోమవారం చిరువ్యాపారుల వద్ద నగదు లాక్కుని పరుగులు తీస్తున్న ఓ యువకుడ్ని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల సహకారంతో యువకుడ్ని చిన్నబజారు పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారిస్తున్నారు.

సురక్షిత నీటిని అందించడమే లక్ష్యం



ఏఈ కార్తీక్‌రెడ్డితో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌శర్మ

మనుబోలు : ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జల్‌జీవన్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌శర్మ తెలిపారు. మనుబోలు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ఆయన సోమవారం పరిశీలించి ఏఈ కార్తీక్‌రెడ్డితో మాట్లాడారు. గ్రామాల్లో పిల్లలు, మహిళల ఆరోగ్య భద్రత కోసమే జల్‌జీవన్ మిషన్‌కు శ్రీకారం చుట్టారని తెలిపారు. జిల్లాలో 722 పంచాయతీల పరిధిలోని 838 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌ను అమలు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో 10 నుంచి 15 మందితో నీటి పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి 55 లీటర్ల సురక్షిత తాగునీటిని అందిస్తామని వెల్లడించారు. ఎఫ్‌టీకే టెస్ట్ కిట్లు అందజేసి వాటి ద్వారా తాగునీటిని ఎలా పరీక్షించాలో అవగాహన కల్పిస్తామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇప్పిస్తామని తెలియజేశారు. వారి వెంట ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నేత జానికిరామిరెడ్డి ఉన్నారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు

• పట్టుబడిన వాహనాల ద్వారా రూ.62 వేల రాబడి



మాట్లాడుతున్న సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్

పొదలకూరు : నిషేధిత మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని నెల్లూరు సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలు తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు స్థానిక సెబ్ కార్యాలయంలో సోమవారం వేలం వేయించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సెబ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మూడు వాహనాలను వేలం వేయగా రూ.62,700 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గుట్కాలు, పాన్‌మసాలా, గంజాయిని ఎవరైనా విక్రయిస్తుంటే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. పరివర్తన కార్యక్రమం ద్వారా ఇప్పటికే పలు గ్రామాల్లో నాటుసారా, మత్తు పదార్థాలను అరికట్ట గలిగినట్లు వెల్లడించారు. మండలంలోని బిరదవోలు పంచాయతీలో నాటుసారా కాయడాన్ని పరివర్తన ద్వారానే అరికట్ట గలిగామని పేర్కొన్నారు. అక్రమ మద్యం అమ్మకాలను చాలావరకు గ్రామాల్లో అరికట్టామని, సమాచారం ఇస్తే వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ బి.వెంకట్రావ్, ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెయ్యదూడల ఉత్పత్తికి సహకరించాలి



మాట్లాడుతున్న విజయకుమార్, శ్రీనివాసరావు

కోవూరు : జాతీయ పెయ్యదూడల పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కోవూరులో ఉన్న డీఎల్‌డీఏ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు కృత్రిమ గర్భధారణకు సంబంధించిన పలు మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని 30 నుంచి 40 వరకు పశువులను ఎంపిక చేసుకుని కేవలం పెయ్యదూడలు పుట్టించేలా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జూలై నాటికి లక్ష పెయ్యదూడలు ఉత్పత్తి అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చింతలదేవిలోని కామధేను ప్రాజెక్టులో పిండ మార్పిడి విధానానికి ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, డీడీలు డాక్టర్ సురేష్, డీఎల్‌డీఏ ఈఓ సోమయ్య, ఏడీలు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన



మాట్లాడుతున్న పార్టీ నేతలు

కోవూరు(విడవలూరు) : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరులో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేశామన్నారు. 90 శాతానికి పైగా ప్రజానీకం జగనన్న వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నాడు సంక్షోభం.. నేడు సంక్షేమం



దివ్యాంగుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు) : గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షోభం నెలకొనగా, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతిఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరు సచివాలయం–2 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, ఎవరి ప్రమేయం లేకుండా మా ఖాతాలోనే నగదు జమ అవుతున్నట్లు ఆనందంగా చెప్పారు. అనంతరం కంచరపాళెంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. ఓట్ల కోసం అబద్ధపు హామీలు ఇచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రస్తుతం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇలాంటి సుపరిపాలన దీర్ఘకాలం కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు విజయభానురెడ్డి, అచ్యుతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వంశీకృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ శేషమ్మ, ఎంపీటీసీ సభ్యులు వెంకటశేషమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

వివిధ అనారోగ్య సమస్యలు, తల్లిదండ్రుల్లేని చిన్నారులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.60 వేల ఆర్థిక సాయం ఎమ్మెల్యే అందజేశారు. బిరదవోలు మేఘన, తిరుమల భానుప్రకాష్, తిరుమల రిషితలకు రూ.20 వేల చొప్పున నగదును సొసైటీ బ్యాంక్‌లో డిపాజిట్ చేసి బాండ్‌లను బాధితులకు అందజేశారు.

దాతల సహకారం మరువలేనిది



భవిత కేంద్రానికి ర్యాక్‌ను అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీలోని భవిత కేంద్రానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎంఈఓ దిలీప్ అన్నారు. మండలంలోని జొన్నవాడకు చెందిన అమ్మనబ్రోలు మనోహర్ జన్మదినం సందర్భంగా అతని తల్లిదండ్రులు మల్లికార్జున, రుక్మిణి భవిత కేంద్రానికి సోమవారం వస్తువులను భద్రపరుచుకునే ర్యాక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉంటారని, వారికి అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు, వారికి పౌష్టికాహారాన్ని, బహుమతులను అందించే విషయంలో దాతలు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులరెడ్డి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారం మరువలేనిది



మాట్లాడుతున్న సహిత విద్య సమన్వయకర్త ధనలక్ష్మి

ముత్తుకూరు : పరిశ్రమలు ఇస్తున్న సహకారం మరువలేనిదని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ధనలక్ష్మి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ప్రముఖ పామాయిల్ కంపెనీ కార్గిల్ సంస్థ సోమవారం టీచింగ్–లెర్నింగ్ మెటీరియల్, ఫిజియోథెరపి మెటీరియల్‌ను అందజేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. విలువైన మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఈఓ మధుసూదన చేతుల మీదుగా విద్యార్థులకు ఆట వస్తువులు, బ్యాగులు అందజేశారు. కార్గిల్ సంస్థ ఎండీ, ఇతర ఉద్యోగులు. ఐఆర్డీ సభ్యులు కిరణ్‌కుమార్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండగలా పంచాయతీరాజ్ దినోత్సవం

• సర్పంచ్‌లు, అధికారులకు సన్మానం

వెంకటాచలం : వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సోమవారం పండుగలా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ముజీబున్నీసా, ఈఓపీఆర్డీ వెంకటరమేష్ కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తొమ్మిది విభాగాల్లో మండల స్థాయిలో ఉత్తమంగా రాణించిన గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు అందజేశారు.

• **మనుబోలు :** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి పుట్టా రమణయ్య పంచాయతీరాజ్ వ్యవస్థల గురించి వివరించారు. అనంతరం వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పులికల్లు పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు

పొదలకూరు : మండలంలోని పులికల్లు పంచాయతీకి జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. జిల్లా స్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డును సాధించగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో సర్పంచ్ జీవీ సుబ్బమ్మ, సెక్రటరీ మాధవిలకు అవార్డును అందజేశారు. జెడ్పీచైర్మన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పులికల్లు ఉపసర్పంచ్ శేఖర్, వైఎస్సార్‌సీపీ నేతలు పెంచలరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



వెంకటాచలం : అవార్డు అందుకుంటున్న పూడిపర్తి సర్పంచ్ శ్రావణి

• జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని 11 పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీలను సన్మానించి అవార్డులను అందజేశారు. పొదలకూరు, పార్లపల్లి, కనుపర్తి, ఆర్‌వైపాళెం, చాటగొట్ల, పులికల్లు, బిరదవోలు, విరువూరు, డేగపూడి, వావింటపర్తి, దుగ్గుంట పంచాయతీలు అవార్డుకు ఎంపికైనట్టు కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. మొత్తం తొమ్మిది అంశాలపై పంచాయతీల్లో సర్వే నిర్వహించగా అత్యధికంగా బిరదవోలు పంచాయతీ ఆరు, పులికల్ల నాలుగు అంశాల్లో ముందంజలో ఉండడం విశేషం. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు జి.లక్ష్మీకల్యాణి, కె.రామిరెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులే కీలకం

ఇందుకూరుపేట : పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులు, అధికారులు కీలకమని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. ఇందుకూరుపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కార్యదర్శులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఆదాయ వనరుల ఎంపిక, పారిశుద్ధ్యం వంటి విషయాల్లో కార్యదర్శుల భూమిక కీలమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంధళ్ల శంకరయ్య, ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, ఈఓపీఆర్డీ వసుంధర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య పాల్గొన్నారు.



మనుబోలు సర్పంచ్ పద్మమ్మను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పొదలకూరు : జెడ్పీ కార్యాలయంలో అవార్డును స్వీకరిస్తున్న సర్పంచ్ సుబ్బమ్మ

పంచాయతీల అభివృద్ధికి కృషి

బుచ్చిరెడ్డిపాళెం : పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ నరసింహారావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రధానంగా ఆదాయ వనరులను గుర్తించాలన్నారు. అనంతరం మండలంలోని పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.



పొదలకూరు : సర్పంచ్, సెక్రటరీలను సన్మానిస్తున్న అధికారులు



ఇందుకూరుపేట : కార్యదర్శులను సన్మానిస్తున్న విజయ్‌కుమార్



బుచ్చిరెడ్డిపాళెం : ప్రశంసా పత్రాలు అందుకున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు